
సాక్షి
అనంతపురం
గురువారం । 30 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34 వేలు పలికాయి.



టమాట కిలో రూ.14

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
41.2°/19.3°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత కొనసాగుతోంది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.



న్యూస్‌రీల్

సెల్‌ఫోన్లు, టీవీలు కట్టిపెట్టండి తల్లీ

- 'నైట్ విజన్'లో పదో తరగతి విద్యార్థులకు డీఈఓ సూచన



మాట్లాడుతున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: 'ఏమ్మా టీవీలు చూస్తున్నారా..! పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరకొచ్చాయి. ఈ కొద్దిరోజులు సెల్‌ఫోన్లు, టీవీలు కట్టిపెట్టండి తల్లీ..' అంటూ డీఈఓ సాయిరామ్ విద్యార్థినులకు సూచించారు. నైట్‌విజన్‌లో భాగంగా బుధవారం రాత్రి అనంతపురంలోని జీసస్‌నగర్‌లో గల మైనార్టీ వెల్ఫేర్ బాలికల వసతి గృహానికి వెళ్లారు. అలాగే సమీపంలోని విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. పదో తరగతి.. విద్యార్థి జీవితానికి మలుపు అన్నారు. తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయబోతున్నారని.. ఏకాగ్రతతో చదువుకోవాలని సూచించారు. ఇళ్లు, హాస్టళ్ల వద్ద పిల్లలు చదువుకునే వాతావరణం కల్పించాలన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను అడియాసలు చేయవద్దని విద్యార్థినులను కోరారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకుని మంచి శ్రేణితో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, వసతిగృహం వార్డెన్, ఉపాధ్యాయులు ఉన్నారు.


ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు




కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ కె.ఫక్కీరప్ప

అనంతపురం అర్బన్/ శ్రీకంఠం సర్కిల్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ కె.ఫక్కీరప్ప శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. శ్రీరాముని చల్లని దీవెనలతో జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని ఆకాంక్షించారు.

వర్సిటీల పాలకమండలి సభ్యుల గడువు పొడిగింపు



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుల పదవీ కాలం మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు యూనివర్సిటీల పాలక మండళ్లు 2020 మార్చి 23వ తేదీన నియామకమయ్యాయి. మూడేళ్ల పదవీ కాలం ఈ మార్చి 22కు పూర్తయింది. పాలక మండలి సభ్యుల ప్యానళ్ల ఏర్పాటుకు మరింత సమయం అనివార్యం కావడంతో పాత పాలక మండలి సభ్యుల పదవీకాలం రెండు నెలల పాటు పొడిగించారు. నిర్దేశించిన రెండు నెలల లోపు పాలకమండలి సభ్యుల నియామకం పూర్తిచేయనున్నట్లు ఉన్నత విద్యామండలి సెక్రటరీ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీకి విన్నవించుకోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: హిందూస్తాన్ యూనిలీవర్, హైదరాబాద్ వారు 25 మంది బాలిక/మహిళా క్రికెటర్లకు స్కాలర్‌షిప్ అందించనుంది. ఇందు కోసం ఏప్రిల్ రెండో తేదీ ఉదయం 8 గంటలకు అనంత క్రీడా మైదానంలో క్రికెట్ పోటీల ద్వారా ఎంపిక చేయనున్నారు. 12 నుంచి 20 ఏళ్లలోపు అమ్మాయిలు యూనిఫాం, క్రికెట్ కిట్, సర్టిఫికెట్లతో ఎంపిక పోటీలకు హాజరుకావాలన్నారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలి



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థిని



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

- ఆ దిశగా వైద్యులు కృషి చేయాలి
- రోగులకు సాంత్వన కల్గించినప్పుడే వృత్తికి సార్థకత
- నైపుణ్యంతోనే రాణించగలరు
- లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ
- ఘనంగా మెడికల్ కళాశాల స్నాతకోత్సవం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించేందుకు వైద్యులు కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ పిలుపునిచ్చారు. వివిధ రుగ్మతలతో బాధపడే రోగులకు పూర్తిస్థాయిలో సాంత్వన చేకూర్చినప్పుడే వృత్తికి సార్థకత చేకూరుతుందని పేర్కొన్నారు. అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో బుధవారం రాత్రి 2017 బ్యాచ్ వైద్య విద్యార్థుల స్నాతకోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి జయప్రకాష్ నారాయణతో పాటు ఇన్‌కం ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ వైద్యుల ప్రధాన కర్తవ్యం సమాజానికి ఉపయోగపడడమేన్నారు. ప్రస్తుత సమాజంలో వివిధ రోగాలతో బాధపడుతున్నవారు అనేకమంది ఉన్నారని, వారందరికీ వైద్యాన్ని చేరువ చేసేందుకు అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. వృత్తిలో నైపుణ్యం సాధించినప్పుడు మాత్రమే ఉన్నతంగా రాణించగలరన్నారు. వైద్య విద్య అభ్యసించడమే కాకుండా.. ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా పెంపొందించుకోవాలని సూచించారు. నేడు ఆరోగ్య వ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, వాటికనుగుణంగా నైపుణ్యత సాధించి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని సూచించారు. ఆరోగ్య వ్యవస్థను బాగుచేసే బాధ్యతను మీరు తీసుకోవాలన్నారు. అలాగే తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు అందించే ప్రోత్సాహమే మనల్ని ఉన్నత స్థానానికి చేరుస్తుందన్నారు. స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. సమయస్ఫూర్తి, వృత్తి నైపుణ్యం, సత్ప్రవర్తనతో ముందుకు సాగాలన్నారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన 100 మంది వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ముఖ్య అతిథులు అందించారు. కార్యక్రమంలో 2019 బ్యాచ్ విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆనందమానందమాయె...



వైద్య డిగ్రీ పట్టా అందుకుంటున్న విద్యార్థిని



ఆనంద క్షణం..మొబైల్‌లో పదిలం

కేంద్ర మంత్రి దృష్టికి రోడ్డు పనులు



కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం క్రైం: అనంతపురం ఎంపీ తలారి రంగయ్య బుధవారం పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిశారు. జాతీయ రహదారుల అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల గురించి చర్చించారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఇదే రోజు ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఓటరు జాబితా ప్రక్రియలో నిర్లక్ష్యం వీడండి

అనంతపురం సిటీ: ఓటరు జాబితాలో మార్పు, చేర్పులకు సంబంధించిన ప్రక్రియలో నిర్లక్ష్యం వీడాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కె.భాస్కర్‌రెడ్డి ఆదేశించారు. ఈ అంశానికి సంబంధించి ఆయన బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు (ఎన్నికల విభాగం), మండల స్థాయి అధికారులు, బూత్ లెవల్ అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో పేర్లు, పుట్టిన తేదీ, చిరునామా, ఒక చోట నుంచి మరో ప్రాంతానికి ఓటు బదిలీ, ఆధార్‌తో అనుసంధానం వంటి అంశాలకు సంబంధించి సేకరించిన దరఖాస్తులను చాలా మంది ఇప్పటికీ జిల్లా కార్యాలయాలకు చేర్చలేకపోయారని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే దరఖాస్తులను జిల్లా కార్యాలయాలకు చేర్చడంతో పాటు ఏ ఒక్క పనీ పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. లేకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ అమృత్‌రాజ్ పాల్గొన్నారు.







ఇద్దరికి జీవిత ఖైదు

- మరో ఇద్దరికి ఆర్నెళ్ల జైలు శిక్ష
- ఇంకో ఇద్దరికి జరిమానా విధింపు
- విజయభాస్కర్‌రెడ్డి హత్య కేసులో గుత్తి ఏడీజే కోర్టు తీర్పు



హత్యకు గురైన విజయభాస్కర్ రెడ్డి (ఫైల్)

గుత్తి: పెద్దవడుగూరు మండలం క్రిష్టిపాడులో జరిగిన చిట్టెం విజయభాస్కర్‌రెడ్డి హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలకు జీవిత ఖైదు పడింది. మరో ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష, ఇంకో ఇద్దరికి జరిమానా విధిస్తూ గుత్తి ఏడీజే కోర్టు న్యాయమూర్తి కబర్థి సంచలన తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. అప్పేచర్ల గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి (వైఎస్సార్‌సీపీ), జేసీ దివాకర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, టీడీపీ సీనియర్ నాయకుడు అయిన తిమ్మాపురం వెంకటేష్‌కు మధ్య రాజకీయ ఆధిపత్య పోరు ఉంది. ఏ ఎన్నికలు జరిగినా విజయభాస్కర్‌రెడ్డి వర్గీయులే విజయం సాధిస్తూ వచ్చేవారు. ఈ క్రమంలో కిష్టిపాడు సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా విజయభాస్కర్ గెలుపొందారు. ఇది రాజకీయ ప్రత్యర్థి అయిన తిమ్మాపురం వెంకటేష్‌కు మింగుడు పడలేదు. విజయభాస్కర్‌రెడ్డిని అంతమొందిస్తేనే తనకు రాజకీయ ఉనికి ఉంటుందని భావించాడు. ఎలాగైనా విజయభాస్కర్‌రెడ్డిని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో 2015 మార్చి 31న కిష్టిపాడు సింగిల్‌విండో కార్యాలయానికి తిమ్మాపురం వెంకటేష్‌తో పాటు అప్పేచెర్లకు చెందిన పలువురు చేరుకుని, తలుపులు మూసి విజయభాస్కర్‌రెడ్డిని అతి దారుణంగా హత్య చేశారు. హతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొత్తం 16 మందిపై పెద్దవడుగూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సదరు కేసు పలు విచారణల అనంతరం గుత్తి ఏడీజే కోర్టులో తుది విచారణకు వచ్చింది. చార్జ్‌షీట్ పరిశీలన, సాక్షుల విచారణ అనంతరం ముద్దాయిలైన ఏ2 పి.గురుప్రసాద్, ఏ4 గుర్రం శ్రీనివాసనాయుడుకు జీవితఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా, ఏ6 గుర్రం సుధాకర్, ఏ9 గుర్రం శేషాచలపతినాయుడుకు ఒక్కొక్కరికీ ఆరు మాసాల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా, ఏ10 గుర్రం రమణ, ఏ13 గుర్రం వెంకటరమణకు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధిస్తూ ఏడీజే కబర్ధి బుధవారం తీర్పు వెలువరించారు. కేసులో ఏ-1 నిందితుడు వెంకటేష్ అజ్ఞాతంలో ఉన్నాడు. మిగిలిన తొమ్మిది మంది నిందితులు చంద్రశేఖర్ నాయుడు, రమేష్‌నాయుడు, పెద్ద శివశంకర్, మల్లికార్జున, నెల్లూరు రామకృష్ణచౌదరి, నెల్లూరు చౌడప్ప, గుర్రం శ్రీధర్, గుర్రం ప్రభాకర్‌నాయుడు, గుర్రం గోపాల్‌ను నిర్దోషులుగా తేల్చారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి వాదించారు. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పతో పాటు డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బందితో భారీ భద్రత మధ్య ముద్దాయిలను కడప జైలుకు తరలించారు.



అప్పేచర్లలో బందోబస్తు

అప్పేచర్లలో గట్టి బందోబస్తు

పెద్దవడుగూరు : క్రిష్టిపాడు సింగిల్‌విండో అధ్యక్షుడు చిట్టెం విజయభాస్కర్‌రెడ్డి హత్య కేసులో ముద్దాయిలకు శిక్ష పడింది. ఈ నేపథ్యంలో విజయభాస్కర్‌రెడ్డి స్వగ్రామం అప్పేచర్లలో బుధవారం ముందస్తు చర్యల్లో భాగంగా తాడిపత్రి డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. 30 మంది కానిస్టేబుళ్లు, నలుగురు ఎస్‌ఐలు, ఇద్దరు సీఐలు బందోబస్తు విధుల్లో ఉన్నట్లు స్థానిక ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదని ఇరు వర్గాల వారిని హెచ్చరించినట్లు చెప్పారు.

మే 13న లోక్ అదాలత్



అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మే 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు అనంతపురం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మోటార్ వాహన ప్రమాదభరిత కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా) పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, వినియోగదారుల ఫోరం కేసులు, పంచాయతీ ట్యాక్స్ కేసులు, మునిసిపల్ ట్యాక్స్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులకు సంబంధించి అనంతపురం, పుట్టపర్తిలోని అన్ని కోర్టుల్లోనూ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి రాజీ చేయనున్నట్లు వెల్లడించారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కళాశాల కీర్తిప్రతిష్టలు పెంపొందించండి




విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన

- జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన పిలుపు
- ఘనంగా ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం
- జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా విద్యా ప్రణాళిక

అనంతపురం: ఎంతో ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల కీర్తిప్రతిష్టలు పెంపొందించేలా విద్యార్థులు ఉన్నతస్థానాలు అధిరోహించాలని జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పిలుపునిచ్చారు. ఇంజినీరింగ్ కళాశాల 76వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథి వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం విద్యాప్రణాళికలో సమూల మార్పులు చేశామన్నారు. 40 శాతం నచ్చిన సబ్జెక్టులు చదువుకోవచ్చన్నారు. బ్రాంచ్ సబ్జెక్టులే కాకుండా ఇతర బ్రాంచ్ సబ్జెక్టులు సైతం చదవడానికి వెసులుబాటు ఉందన్నారు. బీటెక్ ఆనర్స్ విధానంతో పాటు మేజర్ డిగ్రీతో పాటు మైనర్ డిగ్రీని చదవడానికి అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యార్థులకు దన్నుగా నిలిచేలా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తోందన్నారు. ఈ పథకాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరాలన్నారు. విశిష్ట అతిథి జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రణాళికాబద్ధంగా జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. పరిశ్రమలు స్థాపించి ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ప్రతి విద్యార్థి ఎదగలన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత, స్పోర్ట్స్ సెక్రెటరీ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.భవాని, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

VicenteFerrer
RURAL DEVELOPMENT TRUST
Rural Development Trust, Bangalore Road, Ananthapuramu - 515001. (A.P)
Tel: 08554 – 271456
Lr. No. Printing & Stationery Items - CPD:04/2023-24, Dt. 29.03.2023

NOTICE FOR EXPRESSION OF INTEREST

Sealed quotations are invited by **RDT** from **reputed Firms to supply good quality Printing & Stationery Items.**

All details and Terms & Conditions can be obtained from **Central Procurement Dept**, on any working day between 10.00 AM to 5.00 PM.

Last date for submission of quotations is on or before **08.04.2023** by 5.00 PM (by post or by hand)

NOTE :
1) Quotations are to be sent to **The Director Finance**
2) The envelope should contain **"QUOTATION FOR ________"**
In capital letters to denote certain item category.

Sd/- Chairman-RDT





అనంతలో హత్యల కలకలం

- వ్యక్తిని వేట కొడవళ్లతో నరికి చంపిన వైనం
- వేధింపులు తాళలేక అత్తను హతమార్చిన కోడలు


శ్రీనివాసులు (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్/రాప్తాడు రూరల్: అనంతపురంలో బుధవారం వేర్వేరు చోట్ల చోటుచేసుకున్న రెండు హత్యలు నగరవాసులను ఉలిక్కిపడేలా చేశాయి. అత్త వేధింపులు తాళలేక సోదరుడితో కలిసి ఆమె ను కోడలు హతమార్చగా, గొడవ పడుతున్న వారిని మందలించిన పాపానికి వ్యక్తిని వేటకొడవళ్లతో దారుణంగా నరికిచంపిన ఘటనలు కలకలం రేపాయి.

టమాటా మండీ వద్ద దారుణహత్య

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని టమాటా మండీలో కక్కలపల్లి గ్రామానికి చెందిన కురుబ బిల్లే శ్రీనివాసులు (40) దారుణ హత్యకు గురయ్యాడు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన హత్య బుధవారం ఉదయం వెలుగులోకి రావడంతో ఆ ప్రాంతం ఉలిక్కి పడింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో బిల్లే శ్రీనివాసులు చురుకుగా వ్యవహరిస్తుండేవాడు. టమాటా మండీ గేటు వసూలు టెండర్‌ను దక్కించుకున్నాడు.


శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, పోలీసులు

మంగళవారం రాత్రి టమాటా మండీ సమీపంలో ప్రజాశక్తి నగర్‌కు చెందిన వంశీ, మున్నా, సుబ్రమణ్యం తదితరులు మద్యం సేవించారు. ఇదే సమయంలో శ్రీనివాసులు కూడా వీరికి సమీపంలోనే ఉన్నాడు. మద్యం మత్తులో వంశీ, మున్నా గొడవ పడ్డారు. శ్రీనివాసులు కలగజేసుకుని ఇద్దరికీ సర్దిచెప్పాడు. ఈ క్రమంలోనే వంశీపై చేయి చేసుకున్నాడు. అయితే జులాయిగా తిరిగే వంశీ రెండేళ్ల క్రితం కక్కలపల్లి గ్రామానికి చెందిన యువకుడిపై అకారణంగా చేయి చేసుకున్నాడు. ఆ సమయంలో గ్రామస్తులు వంశీకి దేహశుద్ధి చేశారు. వంశీని కొట్టినవారిలో శ్రీనివాసులు కూడా ఉన్నాడు. ఆ తర్వాత పలు సందర్భాల్లోనూ వంశీ చేస్తున్న చిల్లర పనులను శ్రీనివాసులు ఖండిస్తూ వచ్చాడు. దీన్ని వంశీ మనసులో పెట్టుకున్నాడు. వంశీ, మున్నా గొడవ పడుతున్న సందర్భంలో అడ్డువచ్చిన శ్రీనివాసులుపై అప్పటికే తన వద్ద ఉంచుకున్న కొడవలితో దాడి చేశాడు. తలపై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఘటనా స్థలానికి దిశ డీఎస్పీ ఎ.శ్రీనివాసులు, సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐలు నబీరసూల్, వెంకటరమణ, సిబ్బంది చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సర్పంచ్ గాండ్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ ఇతర నాయకులతో మాట్లాడి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే హత్య!

టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే తమ పార్టీ కార్యకర్త కురుబ శ్రీనివాసులు హత్యకు గురయ్యారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. హత్య విషయం తెలుసుకున్న వెంటనే కక్కలపల్లికి చేరుకున్న ఎమ్మెల్యే.. శ్రీనివాసులు కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో శ్రీనివాసులు భౌతికకాయానికి నివాళులర్పించారు. సాయంత్రం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలిసి ఎస్పీ ఫక్కీరప్పను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుబ శ్రీనివాసులు వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్త అని తెలిపారు. లోకేష్ పాదయాత్ర సందర్భంగా కాటిగానికాలువ సమీపంలో మధ్యాహ్నం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు డిన్నర్ ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇందులో పాల్గొన్న నిందితులు పూటుగా మద్యం తాగి వచ్చి రాత్రికి హత్య చేశారని ఆరోపించారు. దీంతోనే తెలుగుదేశం నాయకులు ప్రేరేపించినట్లు అర్థమవుతోందన్నారు. ప్రజాశక్తినగర్‌లో రౌడీమూకలను అరికట్టాలని కోరారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, పార్టీ మండల కన్వీనర్ బండి పవన్, సర్పంచ్ గాండ్ల కృష్ణయ్య తదితరులున్నారు.

అత్తను చంపిన కోడలు..

వైరుతో అత్త గొంతు బిగించి కోడలు హత్య చేసిన ఘటన నగరంలోని ఆజాద్‌నగర్‌లో జరిగింది. వివరాలు.. ఆజాద్‌నగర్‌లోని ఓ అద్దె ఇంట్లో బాషా, ఉమేరాసుల్తానా దంపతులు నివాసం నివసిస్తున్నారు. వీరి వద్ద తల్లిదండ్రులు సర్దార్‌బీ(57), ఇస్మాయిల్ ఉంటున్నారు. బాషా స్థానిక మార్కెట్ యార్డులో వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా, సుల్తానా ఇంటి వద్దే ఉంటోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలుండగా, సర్దార్‌భీ కుమార్తెల పిల్లలను కూడా తన వద్దే ఉంచుకుంది. తన పిల్లలతో పాటు ఆడబిడ్డ పిల్లలను కూడా చూసుకోవడం సుల్తానాకు బరువుగా ఉండేది. అత్త ప్రతి విషయానికి తనపై గట్టిగా అరవడం, మందలిస్తుండంతో కుమిలిపోయేది. ఈ క్రమంలోనే తన ఇబ్బందులను గుంతకల్లులో ఉంటున్న సోదరుడు వలీకి ఫోన్ చేసి చెప్పింది. అత్తింట్లో కాపురం చేయడం తన వల్ల కాదని, చనిపోతానని వాపోయింది. చెల్లెలు కష్టాన్ని విన్న అన్న సర్దిచెప్పాల్సింది పోయి.. నువ్వు చనిపోతే ఎలా? అవసరమైతే మీ అత్తనే


సర్దార్‌బీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

చంపేద్దామని చెప్పాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి భర్త బాషా మార్కెట్‌యార్డులో డ్యూటీకి వెళ్లగా 10.30 సమయంలో ఇంటికి వచ్చాడు. వాషింగ్ మిషన్‌కు ఉన్న వైరును తీసుకుని మంచంపై నిద్రిస్తున్న సర్దార్‌బీ గొంతుకు చుట్టి అన్నా చెల్లెలు తలాఓవైపు లాగి ఊపిరాడకుండా చేసి చంపేశారు. ప్రాణాలు పోయాయని నిర్ధారించుకున్నాక వలీ వెళ్లిపోయాడు. అయితే, హత్య తమపైకి రాకూడదని భావించిన సుల్తానా గుర్తు తెలియని దొంగలు చేసినట్లు చిత్రీకరించాలని చూసింది. సర్దార్‌బీ మెడలోని పుస్తెల తాడు, తన మెడలోని బంగారు గొలుసును తెంచుకున్న అనంతరం భర్తకు ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు మీ అమ్మను చంపేశారని, తన మెడలోని బంగారు గొలుసుని కూడా లాక్కెళ్లారని చెప్పింది. వెంటనే బాషా ఇంటి యజమానికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. ఆయన కేకలు వేసుకుంటూ రావడంతో కాలనీలో వారంతా నిద్ర లేచారు. ఘటనా స్థలానికి చేరుకుని ఏం జరిగిందని సుల్తానాని ఆరా తీశారు. 100కు ఫోన్ చేయడంతో రంగంలోకి దిగిన ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, అనంతపురం రూరల్ సీఐ భాస్కర్ గౌడ్, త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు, నాల్గవ పట్టణ సీఐ జాకీర్ హుస్సేన్‌లు హత్యకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. కోడలు చెబుతున్న ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సర్దార్‌భీని చంపలేదని నిర్ధారణకు వచ్చారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా అసలు కథ బయటపడింది. దీంతో సుల్తానాతో పాటు ఆమె సోదరుడు వలీని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమారి

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ కృష్ణకుమారి నియమితులయ్యారు. వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ ఆర్. జీవన్ కుమార్ గురువారం పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్‌గా కృష్ణకుమారిని నియమించారు. ప్రొఫెసర్ కృష్ణకుమారికి ఎస్కేయూ రిజిస్ట్రార్‌గా పనిచేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఆమె సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గానూ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఆర్ట్స్, సైన్స్ క్యాంపస్ కళాశాలలు కలిపి ఒకే కళాశాలగా ఏర్పాటు చేయనున్నారు. జూన్ నుంచి ప్రారంభం కానున్న అకడమిక్ సంవత్సరం నుంచి క్యాంపస్‌కు ఒకే ప్రిన్సిపాల్‌ను నియమిస్తారు.


ప్రొఫెసర్ కృష్ణకుమారి

- పాలిమర్ సైన్స్ విభాగాధిపతిగా ఫిజిక్స్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాంగోపాల్ నియమితులయ్యారు. పాలిమర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్లందరూ పదవీ విరమణ చేయగా, కేవలం టీచింగ్ అసిస్టెంట్‌లు, అకడమిక్ కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు. దీంతో ఫిజిక్స్ విభాగానికి చెందిన వ్యక్తిని ప్రిన్సిపాల్‌గా నియమించారు.
- రూసా (రాష్ట్రీయ ఉచ్ఛతార్ శిక్షా అభియాన్) కోఆర్డినేటర్‌గా ప్రొఫెసర్ నాగరాజు నియమితులయ్యారు. ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ నాగరాజుకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఇరువర్గాల ఘర్షణ.. నలుగురికి గాయాలు

గుంతకల్లు రూరల్: ఇరువర్గాల ఘర్షణలో నలుగురికి గాయాలైన ఘటన మండల పరిధిలోని పులగుట్టపల్లి పెద్దతండాలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోపాల్ నాయక్, నెట్టప్ప నాయక్‌లు మంగళవారం రాత్రి ఇంటి ముందు మద్యం తాగుతూ కేకలు వేశారు. పక్కనే ఉన్న నారాయణస్వామి నాయక్ వచ్చి నిద్రభంగం కలిగిస్తున్నారంటూ మందలించి వెళ్లాడు. పక్కనే ఉన్న సుంకమ్మ కూడా వచ్చి మందలించగా.. నెట్టప్పనాయక్ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలోనే ఆయన తమ్ముడు సుధాకర్ నాయక్ కూడా వచ్చి ఆమెపై దాడి చేశాడు. దీంతో సుంకమ్మ పోలీసులను ఆశ్రయించింది. నెట్టప్పనాయక్, సుధాకర్ నాయక్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన పోలీసులకు గొడవలో గోపాల్ నాయక్ కూడా ఉన్నట్లు తెలియడంతో.. బుధవారం ఉదయాన్నే స్టేషన్‌కు రావాలంటూ ఆయనను ఆదేశించారు. దీంతో కోపోద్రిక్తుడైన గోపాల్


గాయపడిన గోపాల్ నాయక్, ఉష, నారాయణస్వామి నాయక్

నాయక్ ఇరుగు పొరుగు వారిని తిట్టడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే నారాయణ స్వామి నాయక్ కలుగజేసుకొని వాగ్వాదానికి దిగాడు. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడటంతో గోపాల్ నాయక్, అతడి భార్య ఉషతోపాటు నారాయణ స్వామి నాయక్‌కు గాయాలయ్యాయి. అందరూ ఆస్పత్రిలో చేరారు. రూరల్ ఎస్‌ఐ సురేష్ విచారిస్తున్నారు.

పీఎఫ్ సొమ్ము విడుదల

- 1,235 మంది ఖాతాలకు రూ.79 కోట్లు జమ

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్, అనుబంధ విభాగాల్లో పని చేసే ఉద్యోగుల పీఎఫ్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న జెడ్పీ, మండల పరిషత్ ఉద్యోగులతో పాటు ఉపాధ్యాయులు సుమారు 1,235 మంది ఖాతాల్లో రూ.79 కోట్లు జమయ్యాయని డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు తెలిపారు. 2022 మే నుంచి ఇప్పటి వరకూ పీఎఫ్ పాక్షిక ఉపసంహరణకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ నగదు జమ చేయడంపై ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ సహకారం మరచిపోలేమని పలువురు తెలిపారు.

బిల్లుల అప్‌లోడ్ ప్రక్రియ పూర్తి

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తయిందని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు. జిల్లా పరిషత్ అనుబంధ పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో పీఎఫ్ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టం) తాగునీటి సరఫరాతో పాటు రహదారులు, భవనాలకు సంబంధించి చేసిన పనులకు ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేశామని వివరించారు. సుమారు వారం రోజుల పాటు తమ సిబ్బంది అన్ని మండలాల నుంచి సమగ్ర వివరాలు తెప్పించి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారని పేర్కొన్నారు. మంజూరైన పనులు, నిధుల విడుదల, పెండింగ్ వివరాలన్నీ అందులో ఉన్నాయని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

విడపనకల్లు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని కరకముక్కల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కరకముక్కలకు చెందిన బోయ లింగన్న కుమారుడు బోయ వెంకటేశులు (40)కు, భార్య లక్ష్మీదేవికి మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. బుధవారం కూడా గొడవ జరగ్గా వెంకటేశులు ఇంటి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఎంత సేపటికీ రాకపోవడంతో చుట్టుపక్కల వెతగ్గా, బాత్ రూంలోనే ఉరివేసుకుని కనిపించాడు. దీంతో కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. పాల్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన పోటీలు

రాప్తాడు: రాప్తాడులో గురువారం శ్రీరామనవమి పండగ, లక్ష్మీ పండమేటి రాయుడు ఉట్ల పరుషను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి వృషబాల బల ప్రదర్శన (రాతి దూలం లాగుడు పోటీలు) నిర్వహిస్తున్నట్లు లక్ష్మీ పండమేటి రాయుడు ఆలయ పాలక మండలి సభ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల యాజమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రూ.60 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి ఎమ్మెల్యే సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి రూ.50 వేలు, తృతీయ స్థానం – ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ రూ.40 వేలు, నాల్గో స్థానం జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి రూ.30 వేలు, ఐదో స్థానం– ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి రాముడు రూ.20 వేలు పంపిణీ చేస్తారని తెలిపారు. పాల్గొనదలచిన వారు సెల్ 81069 46853, 9440088531, 8639828818 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ.. ఒకరి మృతి

తాడిపత్రి: మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామం బుధవారం తెల్లవారుజామున వద్ద ఓ లారీ ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్న సంఘటనలో పాములేటి (45) అనే వ్యక్తి మృతి చెందాడు. రూరల్ ఏఎస్సై కాటయ్య తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల, బెలుం శింగారంకు చెందిన పాములేటి నల్లబండలను తరలించే వాహనాలకు లోడింగ్, అన్‌లోడింగ్ పనికి వెళ్తూ జీవనం సాగించేవాడు. మంగళవారం రాత్రి కొలిమిగుండ్ల బెలుం శింగారం నుంచి నల్లబండల లోడుతో ట్రాక్టర్‌లో నాగరాజుతో కలిసి కడప జిల్లా, కొండాపురానికి బయలుదేరారు. బొందలదిన్నె వద్ద వెళ్తుండగా, వెనుకవైపు నుంచి సిమెంట్ లోడ్ లారీ ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న పాములేటి ఎగిరి కింద పడ్డాడు. అదే సమయంలో లారీ పాములేటిపై వెళ్లడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ ఏఎస్సై కాటయ్య సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దత్తతకు ఇద్దరు చిన్నారులు

అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు చిన్నారులను దత్తతకు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు.రక్తసంబంధీకులు ఆధారాలతో 30 రోజుల్లో సంప్రదించకుంటే దత్తత ఇస్తామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

NURSING ADMISSIONS
■ ఓన్లీ గర్ల్స్ కాలేజీలో, Govt. సీట్స్, GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీలోనే హాస్టల్. అర్హత : ఇంటర్ ఏ గ్రూప్ అయినా OK, సంప్ర : జి. మురళీ, 9030661651. [A-734351]

REAL ESTATE

PLOT FOR SALE
■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-607]
■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-608]
■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-609]

స్థలం అమ్మబడును
■ అనంతపురము టౌన్, విద్యుత్ నగర్, మెయిన్ రోడ్డుకు అతి సమీపంలో 33'X66' కొలతలు గల 5 సెంట్లు స్థలం అమ్మబడును. సెల్ : 9000223306. [A-734341]

LAND FOR SALE
■ మద్దూర్ గ్రామం, పాములపాడు మండలం, కర్నూలు జిల్లాలో నీటి పారుదల గల వ్యవసాయ భూమి 20.5 ఎకరాలు అమ్మకానికి కలదు. సంప్ర : 82175 81518 [L-795154]

SERVICES

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-5668]

WANTED
■ స్టార్ హోంకేర్ HYDలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబీకేర్, ఇంటి / వంట పనికి స్త్రీ/పు, లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం : 16,000/-, రూం +భోజనం ఫ్రీ. ఫోన్: 7801099881, 8639828228 [V-775179]
■ Required Teaching Staff for all Subjects (Full time / Part time) and PRO's and Wardens. # Sri P.R.K. Junior College, 3rd Road, ATP. Cell: 9440045441. [A-7659]
■ అనంతపురము పట్టణంలో, ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు మార్కెటింగ్ executives కావలెను. జీతం + ఇన్సెంటీవ్స్ కలవు. సెల్: 9000336265, 9618595956. [A-616]
■ ఉద్యోగాలు: S.R. నూతనంగా ప్రారంభిస్తున్న బ్రాంచ్‌లలో జాబ్ చేయుటకు యువతీ, యువకులకు అవకాశం. Q: 10th, ఇంటర్, డిగ్రీ (P/F), Age: 18 to 28 నో ఫీజ్, Cell: 9177342337. [WA-6927]
■ మీ ఇంటిదగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15000 నుంచి 20,000 వరకు జీతం.మరిన్ని వివరాలకై 9000408325 [G-795278]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు / అమ్మకం / రియల్ ఎస్టేట్ / ఫర్నిచర్స్ / ఆటోమొబైల్ / కంప్యూటర్స్ / సర్వీసెస్ / జనరల్
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADEPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

■ Wanted PRO'S to work in Reputed International School in Anantapur. Cont: 9100314499, 9440354441. [A-734348]
■ అనంతపురము, హిందూపురంలో మార్కెటింగ్ చేయుటకు యువతీయువకులు కావలెను. జీతం+వసతి, వివరాలు వాట్సాప్ చేయండి సెల్ : 8142331949. [A-734350]
■ JOB VACANCY. Age 18 to 45, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000, ✆ 7207833091. [T-1184]
■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ అ.కా.ను. జీ.15K to 34K ఇంట్రెస్ట్ ఉన్నవారు డీటెయిల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-28700]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795290]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థులు


సొంతూళ్లకు బయలుదేరుతున్న విద్యార్థినులు

ముగిసిన ఇంటర్ పరీక్షలు

రాప్తాడురూరల్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం (జనరల్) పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం 30,413 మంది విద్యార్థులకు గాను 29,668 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 28,602 మందికి గాను 27,948 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,811 మందికి గాను 1,720 మంది హాజరయ్యారు. కాగా ఒకేషనల్ పరీక్షలు ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. ప్రధాన పరీక్షలు సజావుగా ముగియడంతో ఇంటర్ బోర్డు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కేంద్రంలో హాస్టళ్లు, బంధువు ఇళ్లు, అద్దె గదుల్లో ఉంటున్న విద్యార్థులు పరీక్షలు ముగియగానే ఊళ్లకు బయలుదేరారు. బస్టాండులో అన్ని బస్సులు విద్యార్థులతో కిటకిటలాడాయి.

క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని చాందినీ మసీదులో బుధవారం ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ మొహమ్మద్ వసీం సలీం హాజరయ్యారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, చంద్రమోహన్‌రెడ్డి, మసీదు కమిటీ సభ్యులు మునీర్‌బాషా, రఫీ, ఏ1 రఫీ, షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

నడిమివంక సర్వే షురూ

అనంతపురం క్రైం: నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు నడిమివంక సర్వే ప్రారంభించారు. బుధవారం ఏసీపీ శ్రీనివాసులు రెడ్డి బృందం 48వ డివిజన్ 69వ సచివాలయ పరిధిలో రోవర్‌తో సర్వే చేపట్టింది. సచివాలయ పరిధిలోని ఐదు పాయింట్లలో సర్వే చేశారు. మరో రెండ్రోజుల్లో సర్వేలో పూర్తి చేసి.. అక్రమ నిర్మాణాలు, వంక విస్తీర్ణంపై నివేదిక సమర్పిస్తామని ఏసీపీ తెలిపారు.

ఆన్ డ్యూటీ కోసం వినతి

అనంతపురం సిటీ: సచివాలయాల్లో పని చేస్తున్న ఆరోగ్య కార్యకర్తల (ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు)కు ఆన్‌డ్యూటీ వెసలుబాటు కల్పించాలని ఏపీ ఎన్జీఓ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు యూనియన్ ప్రతినిధులు జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో బుధవారం కలసి సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. క్షేత్రస్థాయిలో గర్భిణులకు పరీక్షల కోసం, టీకాలు వేయడానికి, సెక్టార్ సమావేశాలు, ఆశా డే వంటి కార్యక్రమాల సందర్భంగా ముఖ ఆధారిత హాజరు కోసం ఆన్‌డ్యూటీ సౌకర్యం కల్పించాలని కోరారు. సీఈఓ స్పందిస్తూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు

అనంతపురం కల్చరల్: నగరంలో అతి ప్రాచీనమైన విరూపాక్షేశ్వర దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. మరో 20 రోజుల లోపు 'ఎండోమెంట్ కార్యాలయం, డోర్.నం.1-4-609, ఆర్ ఆర్ మాన్షన్, హెచ్ఎస్‌సీ కాలనీ, అనంతపురం' చిరునామకు తమ పూర్తి వివరాలను పంపాలని, దరఖాస్తులు విరూపాక్షేశ్వర ఆలయ ఈఓ వద్ద లభిస్తాయని పేర్కొన్నారు.

'పంటల బీమా'పై తనిఖీలు



కనగానపల్లి సమీపంలోని పొలంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కనగానపల్లి: ఖరీఫ్-2021లో పంటల బీమా మంజూరైన రైతుల వివరాలు, భూ విస్తీర్ణాన్ని వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. 2021 ఖరీఫ్ బీమా మంజూరులో జరిగిన లోపుపాట్లపై పలువురు రైతులు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో మడకశిర ఏడీఏ కృష్ణా మీనన్ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు బుధవారం కనగానపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల్లోకి వెళ్లి భూ విస్తీర్ణం, పంటల సాగు వివరాలు సేకరించారు.

అట్టలు, పెన్నుల పంపిణీ

కనగానపల్లి: స్థానిక కస్తూర్బా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు ఎన్‌కేసీ సేవా సమితి ప్రతినిధులు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రమణ వాటిని విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎన్‌కేసీ సేవా సమితి ప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదు

అనంతపురం టవర్‌క్లాక్: 'మోదీ' ఇంటిపేరుపై వ్యాఖ్యల కేసులో సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పగానే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడం సరికాదని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపటారు. ఈ సందర్భంగా దాదాగాంధీ మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై తీసుకున్న చర్యలు ప్రధాని మోదీ దురహంకారానికి, నియంతృత్వానికి పరాకాష్టగా నిలుస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రామ్‌చరణ్ యాదవ్, శంకర్, నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ బుధవారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 8 అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు 48 మంది, 2 మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు దారుగురు, 51 హెల్పర్ పోస్టులకు 136 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. త్వరలో ఇంటర్వ్యూ తేదీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న బాసట

- ఆర్థిక సాధికారత దిశగా అడుగులు
- అన్ని పథకాల్లోనూ మహిళలకే ప్రాధాన్యం
- విప్లవాత్మక మార్పులను గమనించండి
- 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాల్లో ఎమ్మెల్యే అనంత



హాజరైన మహిళలు, వైఎస్సార్‌సీపీ నాయకులు



మెగా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, చిత్రంలో మేయర్ వసీం

అనంతపురం క్రైం: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి జగనన్న బాసటగా నిలుస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. నాడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మాట తప్పి.. బ్యాంకర్ల దృష్టిలో మహిళలను డిఫాల్టర్లుగా మార్చారన్నారు. తాము అధికారంలోకి వస్తే బ్యాంకుల్లో ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు వాయిదాల్లో తిరిగి చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు జగనన్న 'వైఎస్సార్ ఆసరా' పథకం కింద సాయం అందిస్తున్నారన్నారు. డ్వాక్రా రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచి.. ఆర్థిక సాధికారత దిశగా కృషి చేస్తున్నారన్నారు. విప్లవాత్మకమైన మార్పులను గమనించి.. జగనన్నకు అండగా నిలవాలని మహిళలకు పిలుపునిచ్చారు. నగర శివారులోని గుత్తిరోడ్డు విద్యుత్ కళాభారతి ఫంక్షన్ హాలులో 'వైఎస్సార్ ఆసరా' ఉత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అర్బన్ నియోజకవర్గంలోని 1,026 స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు వైఎస్సార్ ఆసరా మూడో విడత కింద విడుదలైన రూ.7.87 కోట్లకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహాగణపతిం మనసాస్మరామి అనే పాటకు నృత్యం చేసిన ఆలియా అనే చిన్నారిని ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తున్న ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న సాయంతో మహిళలు సమాజంలో మరింత గుర్తింపు తెచ్చుకునేందుకు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఉమానగర్‌కు చెందిన వెంకటేశ్వర మహిళా సంఘం సభ్యురాలు కవిత శానిటరీ న్యాప్‌కిన్స్, శ్రీమాతా మహిళా పొదుపు సంఘానికి చెందిన చెందిన లక్ష్మీ డెయిరీ ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అందించిన సాయానికి కృతజ్ఞతగా వారు ఎమ్మెల్యేను సన్మానించారు.

రూ.800 కోట్ల అభివృద్ధి

ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో జాతీయ రహదారి (ఫోర్‌వే), క్లాక్‌టవర్ బ్రిడ్జ్, గుత్తి రోడ్డు, విద్యుత్‌నగర్, జేఎన్‌టీయూ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అనంత గుర్తు చేశారు. నగరం నలుదిక్కులా రోడ్లు వేయించి.. రాకపోకలకు మార్గం సుగమం చేస్తున్నామన్నారు. రానున్న ఐదారునెలల్లో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, మెప్మా పీడీ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు, కమల్‌భూషణ్, అబూసాలేహ, ముంతాజ్, సంపంగి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు లోకేష్ క్షమాపణ చెప్పాలి'

అనంతపురం: నిరుద్యోగులను నట్టేట ముంచి యువగళం పేరుతో నారా లోకేష్ దొంగ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఎస్కేయూ అధ్యక్షుడు రాధాకృష్ణ యాదవ్ విమర్శించారు. ఆయన బుధవారం ఎస్కేయూలో విలేకరులతో మాట్లాడారు. కమీషన్లకు కక్కుర్తి పడి రాప్తాడులో జాకీ పరిశ్రమ రాకుండా వెనక్కి వెళ్లేలా వ్యవహరించిన నారా లోకేష్ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. పాదయాత్రలు కాదు.. పొర్లుదండాలు పెట్టినా లోకేష్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కనగానపల్లి: మండల పరిధిలోని గుదివాండ్లపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కనగానపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. బుధవారం తగరకుంట- ఎగువపల్లి రహదారిలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా, ఓ ఆటోలో 20 ప్యాకెట్లు రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. బియ్యాన్ని తరలిస్తున్న గంగమ్మ, షేక్ ఫక్రుద్దీన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు. అలాగే తగరకుంట సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి, వాహనదారుడు పేరూరు బ్రహ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీరామ నవమి వేడుకలకు సిద్ధం

- అనంతకు చేరిన ఒంటిమిట్ట ముత్యాల తలంబ్రాలు
- ఉట్లమాను వేడుకలు, కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు



మొదటిరోడ్డు శ్రీకోదండరామాలయంలో పూజలందుకునే సీతారామలక్ష్మణ స్వాములు

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా జరగనున్నాయి. ఇప్పటికే నగరంలో సీతారామాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. భద్రాచలం, ఒంటిమిట్టల్లో ప్రసిద్ధి చెందిన రామాలయాలను తలపిస్తూ అదే సంప్రదాయంలో సాగే అనంతపురం మొదటిరోడ్డు శ్రీ కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సీతారామ కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మరోసారి ఒంటిమిట్ట నుంచి తెప్పించిన ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు, ఎండోమెంటు సిబ్బంది బుధవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో స్వామివారి కల్యాణోత్సవ వేడుకల కోసం పుణ్యక్షేత్రాల నుంచి తెప్పించిన సంప్రదాయ ముత్యాలు, తలంబ్రాలకు ప్రత్యేక పూజలు చేశారు.

వాడవాడలా వేడుకలు

నగరంలోని మారుతీనగర్, రెవెన్యూ కాలనీ, పాతూరు తదితర చోట్ల గురువారం శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. వాడవాడలా సీతారామ కల్యాణోత్సవాలు కమనీయంగా సాగనున్నాయి. వారం రోజులుగా పలు చోట్ల సాగుతున్న శ్రీరామ నామ సప్తాహం ముగింపు దశకు చేరుకుంది. పాతూరు అమ్మవారిశాలలో శ్రీరామ నామస్మరణతో పరిసరాలు మార్మోగుతున్నాయి. సున్నంగేరులోని ప్రాచీన రామాలయంలో ఉట్లపరుష కన్నుల పండువగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తపోవనంలోని శ్రీశివశక్తి సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి వేడుకలు జరుగనున్నాయి.

నేడు శోభాయాత్ర

శ్రీరామ ఉత్సవ సమితి నేతృత్వంలో గురువారం బైక్‌లతో శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఉదయం ఉదయం 9 గంటలకు నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వద్ద ప్రారంభమై పలు వీధుల గుండా శోభాయాత్ర సాగుతుందని, అందరూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. వందలాది మంది భక్తజనం రామనామస్మరణ, నినాదాలు చేస్తూ దైవభక్తిని, దేశభక్తిని చాటుతారన్నారు.

కల్యాణోత్సవానికి తరలిరండి

జగతి మెచ్చిన శ్రీరామచంద్రుని జన్మదినం, కల్యాణోత్సవం ఒకేరోజు జరుపుకోవడం తరాలుగా సాగుతోంది. జన్మ సుకృతమయ్యేలా సీతారాముల కల్యాణం కమయనీయంగా ఈ కోదండరామాలయంలో జరుగుతుంది. సర్వాంగ సుందర భూషణుడైన శ్రీరాముని కల్యాణంలో అందరూ పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరుతున్నాం. సాయంత్రం గ్రామోత్సవం ఉంటుంది.

– భరత్‌శర్మ, పురోహితులు, కోదండరామాలయం, రెవెన్యూకాలనీ

పండమేటి రాయుడు ఉత్సవాలు ప్రారంభం



శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

రాప్తాడు: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి (పండమేటి రాయుడు) బ్రహ్మోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ పండమేటి వేంకటేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి బండ్లపల్లి భజన బృందం పుర వీధుల్లో కోలటంతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీరాముడు, సీతాదేవి విగ్రహాలతో పాటు పండమేటి వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను రామాలయం నుంచి పండమేటి వేంకటేశ్వరస్వామి గుడి వరకూ డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. రాత్రి 9 గంటలకు ఆలయ సమీపంలో భక్త బృందాలు నిర్వహించిన భజన ఆకట్టుకుంది.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో నిర్మించిన కోనేటిలో స్వామి వారికి చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గంజి రాముడు, కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయం దగ్గర ఉట్ల పరుష ఉంటుందన్నారు.

తొలగించిన కొన్నాళ్లకే కిడ్నీలో రాళ్లు



శ్రీనిధి ఆస్పత్రి



ఆస్పత్రిలో ఆందోళనకు దిగిన రోగి బంధువులు

- శ్రీనిధి ఆస్పత్రి ఎదుట రోగి, బంధువుల ఆందోళన

అనంతపురం సప్తగిరి సర్కిల్: తొలగించిన కొన్నాళ్లకే కిడ్నీలో మళ్లీ రాళ్లు బయటపడడంతో రోగి, ఆయన తరఫు బంధువులు నగరంలో సాయినగర్‌లో ఉన్న శ్రీనిధి ఆస్పత్రి ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. గార్లదిన్నె మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డికి గత నెల 25న శ్రీనిధి ఆస్పత్రి డాక్టర్ హరిప్రసాద్ ఆపరేషన్ చేసి కిడ్నీలో ఉన్న 14.5 ఎంఎం రాళ్లను తొలగించారు. రూ. 30 వేలు (ఆరోగ్యశ్రీ కాకుండా) తీసుకున్నారు. ఆపరేషన్ అనంతరం రామ్మోహన్‌రెడ్డికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులకు తోడు విపరీతంగా నొప్పులు వచ్చాయి. దీంతో బెంగుళూరులోని సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో ఫిబ్రవరి 27న చేరాడు. అక్కడి వైద్యులు పరీక్షించి మందులను అధిక మోతాదులో వాడడం వల్ల ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. అక్కడే ఉండి చికిత్స చేయించుకోవాని చెప్పారు. దీంతో రామ్మోహన్‌రెడ్డి 17 రోజులు వైద్యం పొందగా, అందుకు రూ. 3 లక్షల వరకూ ఖర్చయింది. ఈ క్రమంలోనే ఈ నెల 27న నగరంలోని గణేష్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లో పరీక్ష చేసుకోగా కిడ్నీలో 7 ఎంఎం రాళ్లు ఉన్నాయని తేలింది. కిడ్నీలో రాళ్లు తొలగించామని తమను మోసం చేశారంటూ రామ్మోహన్‌రెడ్డి, ఆయన బంధువులు గురువారం శ్రీనిధి ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. అమాయక ప్రజలను మోసం చేస్తారా అంటూ డాక్టర్లను నిలదీశారు. తనకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మత్తుతో జీవితం చిత్తు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి తదితరులు

అనంతపురం: మత్తు పదార్థాలకు బానిస అయితే జీవితం చిత్తు అవుతుందని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బుధవారం 'నషా ముక్తా భారత్ అభియాన్'లో భాగంగా వర్సిటీ విద్యార్థులకు మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెక్టార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, అభ్యసనం, కఠోర శ్రమతో ఉన్నతస్థానాలు చేరుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.అబ్దుల్ రసూల్, ఎస్కేయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డ్రగ్స్ అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశాంక్, ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తండ్రి అదృశ్యం



మహమ్మద్‌రఫీ, ఇమ్రాన్, సోహైల్ (ఫైల్)

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక రంగస్వామి నగర్‌కు చెందిన మహమ్మద్ రఫీ, తన ఇద్దరు కుమారులతో కలసి అదృశ్యమయ్యాడని త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఆయన తన కుమారులైన ఇమ్రాన్ (9), సోహైల్ (6) తీసుకొని వెళ్లిపోయాడు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని గాలిస్తున్నట్లు తెలిపారు. వీరి జాడ తెలిస్తే అనంతపురం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. నంబర్ 9490618679 ను సంప్రదించాలన్నారు.

రబీలో పెరిగిన వేరుశనగ సాగు



వేరుశనగ కట్టెను పొలంలోనే మిషన్‌కు ఆడిస్తున్న దృశ్యం



మిషన్‌కు వేయడానికి వేరుశనగ కట్టెను తీసుకొస్తున్న దృశ్యం

ఆత్మకూరు: సాగునీటి ఇబ్బందులు లేకపోవడం, మార్కెట్ పంటకు గిట్టుబాటు ధర లభిస్తుండటంతో రైతన్నలు వేరుశనగ సాగుకు మొగ్గు చూపారు. దీంతో ప్రధాన పంట వేరుశనగ సాగు విస్తీర్ణం గతంతో పోలిస్తే ఈ రబీలో భారీగా పెరిగింది. ఎక్కువగా బోరుబావుల కిందే సాగులో ఉంది. మండలంలోని వై.కొత్తపల్లి, పి.కొత్తపల్లి, సింగంపల్లి, సింగంపల్లి తండా, పంపనూరు, సనప, గొరిదిండ్ల వంటి గ్రామాలు హంద్రీనీవా కాలువ పక్కనే ఉండటంతో ఆయా గ్రామాల రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకపోవడంతో వారంతా వేరుశనగకే మొగ్గుచూపారు. ఫలితంగా గత ఏడాది రబీలో మండల వ్యాప్తంగా 3,200 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయగా, ఈ సారి బోరుబావుల కింద 4,155 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగులోకి వచ్చింది. ఎకరా వేరుశనగ పంట సాగుకు విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీలు...ఇలా దాదాపు రూ.25 వేల వరకు ఖర్చు వచ్చిందని రైతులు చెబుతున్నారు. బోరు బావుల కింద ఎకరాకు 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వస్తోందని, ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా వేరుశనగ రూ.7,500 వరకు పలుకుతుండగా, గిట్టుబాటు అవుతుందంటున్నారు.

కుక్క పిల్లలకు నిప్పు



కాలిన గాయాలతో ఉన్న కుక్కపిల్లలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ముళ్లపొదల్లోని కుక్కపిల్లలకు ఎవరో నిప్పుపెట్టారు. ఈ ఘటనలో మూడు పిల్లలు చనిపోగా.. మరో రెండు గాయాలతో బయటపడ్డాయి. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల్ కావడంతో జంతు ప్రేమికులు భగ్గుమంటున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. ఆర్‌కే నగర్‌లోని ఓ ముళ్ల పొదల మాటున కొన్ని కుక్క పిల్లలు ఉన్నాయి. ఓ మహిళ అక్కడే చెత్త వేసి.. స్థానికులు వారిస్తున్నా వినకుండా వాటికి నిప్పు పెట్టినట్టు తెలుస్తోంది. మంటల్లో కాలి మూడు పిల్లలు చనిపోయినట్లు, మరో రెండు కుక్కపిల్లలు గాయాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అనంతరం గాయపడిన కుక్కపిల్లలకు స్థానికులు పశువుల ఆస్పత్రిలో చికిత్స చేయించి కాపాడారు. ఈ విషయమై త్రీటౌన్ పోలీసులను వివరణ కోరగా.. ఘటనకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని చెప్పారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

అనంతపురం రూరల్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ గురువారం జిల్లాకు రానున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నార్పల మండలం బొందలవాడలో పర్యటించి.. ఇటీవల హత్యకు గురైన రమాదేవి కుటుంబాన్ని పరామర్శిస్తారని పేర్కొన్నారు.

నమ్మించి...వంచించాడు

- బాలికను మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు

రాప్తాడు రూరల్: ప్రేమ పేరుతో బాలికను నమ్మించాడు. తర్వాత వంచనకు గురి చేశాడు. ఆ వ్యక్తిపై అనంతపురం రూరల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాప్తాడు మండలం గాండ్లపర్తి గ్రామానికి చెందిన నల్లప్ప ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. రాప్తాడు మండలానికి చెందిన 17 ఏళ్ల వయసున్న బాలిక అనంతపురం రూరల్ మండల పరిధిలోని తన బంధువు ఇంట్లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆ బాలికను నల్లప్ప ప్రేమ పేరుతో నమ్మించాడు. ఈ క్రమంలోనే ఈ నెల 18న బాలిక ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అదే రోజు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు బాలికను వెంట తీసుకెళ్లిన యువకుడు రెండు రోజుల కిందట అనంతపురం బస్టాండ్‌లో వదిలి వెళ్లాడు. అక్కడి నుంచి బంధువుల ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని తెలియజేసింది. వారి సాయంతో బుధవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నల్లప్పపై పోక్సో కేసు నమోదు చేసి, దిశ పోలీస్‌స్టేషన్‌కు బదలాయించారు.

నేటి నుంచి యథావిధిగా నీటి సరఫరా

అనంతపురం క్రైం: నగరంలోని నడిమివంక వద్ద ఏపీఎండీపీ పైప్‌లైన్ మార్పిడి పనులు పూర్తయ్యాయని, గురువారం నుంచి నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని నగర పాలక సంస్థ మేయర్ వసీం, నీటి సరఫరా విభాగం డీఈ నరసింహ తెలిపారు. ఇప్పటికే ఫిల్టరేషన్ పాయింట్ నుంచి పంపింగ్ మొదలైనట్లు చెప్పారు. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. అంతకుముందు మేయర్ నడిమివంక వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలించారు. కాగా..పైప్‌లైన్ మార్పిడి పనుల నేపథ్యంలో బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాలకు 13 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు.



సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

అనంతపురము డివిజన్

9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727